అన్యోన్య దాంపత్యం

సి. నరసింహారావు

దాంపత్యాన్ని అన్యోన్యంగా తీర్చిదిద్దే ప్రామాణిక గ్రంధం

Anyonya Dampatyam

(The Art & Science of Marital Life)

Author:

C. NARASIMHA RAO

Price :

One Hundred and Fifty Rupees

Publishers :

Nani International,

408, Vijaya Towers,

Shanthi Nagar,

Hyderabad-500028

Phones:

66665146

9866181388

23313224

Website:

www.narasimharao.com

Printed at:

Sai Ram Process,

114, Sovereign Shelters,

Lakadi-ka-pool,

Hyd-500 004

Copies available at:

all branches of

Visalandhra Book House

అన్యోన్య దాంపత్యానికి ఆహ్వాన పత్రం

ఈగ్రంథం దాంపత్య జీవితాన్ని సుస్సంపన్నంగా తీర్చిదిద్దడానికి ఉద్దేశింపబడింది. ఈ వాక్యం చదవగానే వైవాహిక జీవితం గురించి తాము క్రొత్తగా తెలుసుకోవలసినదేమున్నదంటూ చాలామంది నవ్వుకొంటారు. మన సమాజంలో అత్యధికశాతం మంది దంపతులు వివాహం ద్వారా తమకు యథాలాపంగా లభించే పరిమిత ఆనందంతోనే సంతృప్తి చెందుతున్నారు. ఇటువంటి వారు తమ తమ దాంపత్యజీవితాలను గురించి పెద్దగా పట్టించుకోకుండా భిన్న స్థాయిలలో తమ దాంపత్యాలను గడుపుతున్నారు. ఏనాడు రవ్వంత విచారానికి లోనుకాని దాంపత్యాలనుండి అసలు చిరునవ్వుకే నోచుకోని దాంపత్యాల వరకు ఇవి విస్తరించివుంటాయి.

వైవాహిక జీవితాన్ని గురించి అలోచించకుండా యాంత్రికంగా, అనాలోచితంగా దాంపత్య జీవితంలోకి ప్రవేశించే యువతీయువకుల దాంపత్యం, మన సమాజంలోని సగటు దాంపత్యాలలాగా పేలవంగా, నిస్తేజంగా, నిస్సారంగా మిగిలిపోవడంలో ఆశ్చర్యమేదీలేదు. వైవాహిక జీవితంలో సంతోషం దానంతటదే లభిస్తుందని ఎదురుచూసేవారికి సహజంగానే నిరాశా, నిస్పృహలే మిగులుతాయి. మనలో చాలమంది దాంపత్యానుబంధాన్ని తేలికగా, చులకనగా, తాము పెద్దగా ఆలోచించనవసరం లేనిదిగా చూడడం వలన, తన తోటలో విప్పారిన పుష్పాల మృదుమనోహరసోయగాన్ని, వాటి సౌరభాన్ని పట్టించుకోలేని తోటమాలిలాగా, తమ దాంపత్యాన్ని రసభరితంగా, అనుక్షణం ఆనందపారవశ్యాల మైమరుపుగా మలచుకోకలిగి కూడా తమ ఆలోచనా రాహిత్యంతో రసహీనంగా మిగిల్చివేస్తున్నారు. ఇందుకు భిన్నంగా, తమంతటతాము **తమ సంసారంలో స్వర్గధామాన్ని సృష్టించుకోవాలని నిశ్చయించుకొని, అందుకై స్పష్టంగా ప్రయత్నించేవారికి మాత్రమే తమ**

దాంపత్యంలో సర్వసుఖాలు లభ్యమవుతాయి. తమ చుట్టూ వున్న స్థితిగతులన్నీ యధాతధంగానే వున్నప్పటికీ, తమ ఆలోచనా ధోరణిలో, ప్రవర్తనా సరళిలో అతిసులభమైన కొద్దిపాటి సవరణలు చేసుకోవడం ద్వారా భార్యాభర్తలు తమ దాంపత్యాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చు. తమ సంసారంలో భూతలస్వర్గాన్ని సృష్టించుకోవచ్చు.

తమ తమ మనస్సులో చెలరేగే భావనలను ఎప్పటికప్పుడు స్వేచ్ఛగా వ్యక్తం చేయడమే దాంపత్యజీవితంలో సహజమైన విషయమని, తమకెంత ప్రాప్తమో అంతే అనుభవించగలమని, తమ వివాహాన్ని గురించి ఎక్కడో చదివి, నూతన అవగాహనను రూపొందించుకోవడం, అందుకనుగుణంగా ప్రవర్తించబోవడం, కృత్రిమంగా ఉంటుందని కొంత మంది భావించవచ్చు. ఈ సందర్భంలోనే మనం గుర్తించాల్సిన అంశం ఒకటి ఉంది. మనం సహజప్రవర్తన అని భావించేదంతా మనం తెలిసీతెలియని వయస్సులో ఇతరుల నుండి నేర్చుకొన్నదే! ఈ అంశాన్ని గుర్తించితే ఈ 'సహజ ప్రవర్తనకు' ఎవరైనా శాశ్వతంగా అంకితం కావలసిన అవసరం ఉండదు. అందుకే దాంపత్యంలోకి ప్రవేశించే వారందరూ మున్ముందుగా వైవాహికానుబంధం పట్ల బాల్యం నుండి తమ అంతరంగాలలో పేరుకొన్న ఇతరుల ప్రభావాలను గుర్తించి వాటిని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి. వీటిలో తమ దాంపత్యానికి తగినవేవో ఎంచుకొని, మిగిలిన వాటిని నిర్దాక్షిణ్యంగా త్రోసిపుచ్చాలి.

వైవాహికబంధపు సమాగంతో జీవితాంతం ఒకటిగా జీవిస్తూ, తమ తమ జీవితాలకు పరిపూర్ణతను సాధించుకోవడమే దాంపత్యలక్షణంగా, లక్ష్యంగా భార్యాభర్తలు గుర్తించినప్పుడు వారి దాంపత్యం అనునిత్యం వసంతోత్సవంగా రూపుదిద్దుకొంటుంది. అలా కాకుండా భార్య ప్రవర్తన, భర్త ప్రవర్తన ఫలానా, ఫలానా విధంగా వుండి తీరాలని భావించేవారు భార్యాభర్తల విస్తృత అనుబంధాన్ని ఏవో కొన్ని సామాజిక బాధ్యతల స్థాయికి కుదించివేస్తున్నారు. భర్త నిరంతరం తన మానసిక అవసరాలను గుర్తించి, ఎప్పటికప్పుడు వాటిని తీర్చాలని, అలాగే తనను నిరంతరం గౌరవించుతూ, తన మాటలకు ఎదురు చెప్పకుండా వంటపని, పిల్లల పెంపకాలను చూసుకోవడం భార్య బాధ్యతఅని భావించడం సబబుకాదు. వేగంగా మారిపోతున్న జీవనవిధానానికి అనుగుణంగా ప్రతి పనిలోను ఒకరికొకరు చేదోడువాదోడుగా నిలవాలి. తమతో కలసి తన జీవితాన్ని పంచుకొనే మరొక వ్యక్తితో తామెలా

ప్రవర్తించాలన్నది ఎప్పటికప్పుడు కొత్తగా నిర్ణయించుకోలేని భార్యాభర్తలు తమ మధ్య సవ్యమైన అనుబంధాన్ని నెలకొల్పుకోలేరు. ఒక భార్య లాగా, లేక ఒక భర్త లాగా మాత్రమే ప్రవర్తించాలనుకొనే వారు తమ తమ జీవితాలను సాంప్రదాయిక నిర్దేశనలకే పరిమితం చేసుకొంటున్నారు. నిత్యం చైతన్యం వెల్లివిరియవలసిన తమ దాంపత్యానుభవాన్ని ఒక సామాజిక బాధ్యతగా మిత్రమే మిగిల్చివేస్తూ జీవన వికాసానికి దూరంగా మిగిలిపోతున్నారు.

నేటి మనసమాజానికి కేవలం వందేళ్ళక్రితం మన సమాజపు స్థితికి ఏమాత్రం పోలికేలేదు. మన సమాజం అతివేగంగా ఆధునికమవుతున్నా మన కుటుంబవ్యవస్థలో అంతటివేగంగా పరివర్తన చోటు చేసుకోవడం లేదు. భయం భయంగా, ఆభద్రతాభావనతో, భవిష్యత్తు ఎలా ఉంటుందోనన్న అనిశ్చతస్థితితో, వివాహం తమ జీవితంలో ఏదో అద్భుతం తెస్తుందన్న ఆశతో, అసలీ వివాహమన్నది సమాజం తమపై విధించిన నిర్బంధమన్న ఆలోచనతో, యువతీయువకులు వందేళ్ళ క్రితం ఎంతటి నిస్సహాయంగా దాంపత్యజీవితంలోకి అడుగిడేవారో, ఇప్పుడు సైతం వారు అటువంటి నిస్సహాయభావనలతోనే వైవాహిక జీవితంలోకి ప్రవేశిస్తున్నారు. ఈ కారణంగానే వందలాది సంవత్సరాలకు పూర్వం ఉమ్మడి కుటుంబాలలో భార్యాభర్తలు నిర్వహించిన పాత్రలను మరో ఆలోచన లేకుండా ఇప్పటికి అనుకరించడానికి యువతీయువకులు సంసిద్ధం అవుతున్నారు. వంటగదిలో భర్త సాయం చేయబోతే ఏదో అపచారం జరిగిపోయిందనుకొనే ఉన్నతోద్యోగిని, మనస్సంతా దు:ఖం నింపుకొని పైకి చిరునవ్వు ప్రదర్శించే అమాయకపు భార్య, ఎల్లవేళలా అతిసన్నిహితంగా మెలగడానికి సంకోచించే భార్యాభర్తలు, తన వ్యాపారానికి,ఉద్యోగానికి సంబంధించి భార్యసలహా కోరాలన్న ఆలోచనే రాని భర్త, వీరందరూ ఎందుకిలా ప్రవర్తిస్తున్నారు? చుట్టూ వున్న వారి దృష్టిలో మర్యాదగా, గుంభనగా, నిగ్రహంగా, హుందాగా ప్రవర్తిస్తున్నామనుకుంటూ, ఫలితంగా తమకు సామాజిక గౌరవం లభిస్తున్నదని వీరు భ్రమిస్తుంటారు. ఇటువంటి వారు ఏదో బూటకపు గౌరవాలు లభిస్తాయనుకొంటూ జీవన మాధుర్యాన్ని విస్మరిస్తున్నారు. దాంపత్య జీవితాన్ని ప్రకాశవంతం చేసుకోగల అవకాశాలను ఎప్పటికప్పుడు జారవిడుచుకొంటున్నారు. దాంపత్యజీవితంలో తాము తీసుకొనే నిర్ణయాలన్నింటికీ కొలబద్ద తమ ఆనందమే అయివుండాలి. దాంపత్యానికి సంబంధించినంతటివరకూ భార్యాభర్తలిద్దరి సంతృప్తికి, వారిద్దరి సంతోషానికి

మించిన విషయాలేవీ ఈ ప్రపంచంలో వుండవు. వుండడానికి వీల్లేదు. ఏ క్షణానికాక్షణం, ఏరోజుకారోజు భార్యాభర్తలు సంతోషంగా వుండడం, అందుకై ప్రయత్నించడంకంటే విలువైన విషయం వారికి మరేం వుంటుంది?

దాంపత్యంలో ఇద్దరు వ్యక్తుల మధ్య, మరెవ్వరిమధ్యా సాధ్యంకానంతటి అత్యంత సాన్నిహిత్యం చోటు చేసుకొంటుంది. అయినా ఈ ముఖ్య అంశాన్ని చాలమంది సవ్యంగా గుర్తించకపోవడం వలన తమ మదిలోని ఉద్రేకాలను, ఆవేశాలను, ఆందోళనలను, అసౌఖ్యాలను, భయాలను, సంకోచాలను అలాగే ప్రేమానురాగాలను, తదితర మృదు మధురభావనలను స్పష్టంగా, సవ్యంగా సమర్ధవంతంగా గుర్తించి ఎదుటివారికి అర్థమయ్యేరీతిలో వ్యక్తం చేయలేకపోతుంటారు. ఇలా వ్యక్తం చేయలేనివారు, ఎదుటివారి మనోభావాలను సైతం స్పష్టంగా గుర్తించడంలో విఫలమవుతుంటారు. ఈ కారణంగా తనపట్ల భర్త అనునిత్యం అమితాసక్తిని, అనురాగాన్ని ప్రదర్శించాలని అభిలషించే భార్య, తనమదిలో నిక్షిప్తమైన అనురాగాన్ని అనవసరంగా వ్యక్తం కాగూడదనుకొనే భర్త – తమ జీవితాలను అనురాగమయంగా రూపొందించుకోకలిగికూడా భిన్నధ్రువాలుగా మిగిలిపోతుంటారు. దంపతులిద్దరూ సవ్యమైన అవగాహనతో ఒకరికి ఒకరు పారదర్శకంగా కన్పించడానికి ప్రయత్నించేటప్పుడు మాత్రమే ఇద్దరు వ్యక్తులు ఒకటిగా రూపొందడమనే అద్భుతం చోటు చేసుకుంటుంది.

వేరు వేరు పరిసరాలలో, భిన్న ప్రభావాల మధ్య పెరిగిన ఇద్దరు వేర్వేరు వ్యక్తులు దాంపత్యానుబంధంతో తమ తమ మానసిక, భౌతికఅవసరాలు తీర్చుకోవడానికి ఎదుటివారిపై ఆధారపడుతున్నప్పుడు ఓ అపూర్వపరిణామం సంభవిస్తుంది. భార్యభర్తలలో ప్రతి ఒక్కరి స్వంతవ్యక్తిత్వం, ఆలోచనలు, ఆశయాలు, ఆవేశాలు, అభిలాషలు, అభిరుచులు, తమ జంటకు సంబధించినవిగా రూపొందుతాయి. తిరిగి తమ జంట భార్యాభర్తలిద్దరి వ్యక్తిత్వాన్ని, జీవితాన్ని ప్రభావితం చేస్తూ ఇద్దరూ సంపూర్ణవ్యక్తులుగా ఎదగడానికి నిరంతరం దోహదం చేస్తుంది. ఇలా దంపతులలో ప్రతిఒక్కరి వ్యక్తిత్వం తమ దాంపత్య వ్యక్తిత్వంగా తిరిగి ఈ దాంపత్య వ్యక్తిత్వం భార్యాభర్తలిద్దరి స్వంత వ్యక్తిత్వంగా నిరంతరం రూపొందడం, రూపాంతరం చెందడం, దాంపత్యజీవితంలోనే అపూర్వమైన అనుభవంగా, రెండు భిన్న వ్యక్తిత్వాల సమాగంగా, అద్భుతమైన తాదాత్మ్యతగా మిగులుతుంది.

ఈ సమాజంలో ఎవరైనా తమ జీవితాన్ని ఎంతటి అనందదాయకంగా, అర్థవంతంగా, ప్రశాంతంగా, ఫలప్రదంగా, హుందాగా గడుపుతున్నారో తెలుసుకోడానికి వారి దాంపత్యజీవితమే సరైన గీటురాయి. ప్రతి ఒక్కరి జీవితంలోనూ లభించే ఆనందాన్ని, సంతృప్తిని, ప్రశాంతతను, అన్నింటికి మించి వారి జీవననాణ్యతను వారి వారి దాంపత్య జీవితమే నిర్ణయిస్తుంది.

ఒక యువకుడు, ఒక యువతి కలసి ఇద్దరికీ ఆమోదయోగ్యంగా, ఆనందదాయకంగా వుండేట్లు జీవితాన్ని గడపడమే దాంపత్యజీవనమనే మూలసూత్రాన్ని చాలమంది దంపతులు గుర్తించకుండా, ఈ ప్రపంచంలోని విషయాలన్నింటినీ తమ దాంపత్యంలోకి జొప్పించి తమతమ జీవితాలను క్లిష్టదాయకం చేసుకొంటున్నారు. దాంపత్య జీవితంలో ఇద్దరికీ అనేక బాధ్యతలు, క్లేశాలు, అశాభంగాలు, అవమానాలు, అనుమానాలు ఎదురుకావచ్చు. బయట ప్రపంచం నుండి ఎదురయ్యే క్లేశాలేవీ తమ దాంపత్యంలోకి, అంటే భార్యాభర్తల మధ్యకు ప్రవేశించనీయగూడదని దృఢంగా నిశ్చయించుకొనే దంపతులు తమ దాంపత్యాన్ని– తమ తమ జీవితాలకు పరిపూర్ణత కలిగించేదిగా రూపొందించుకోకలుగుతారు. ఒంటరితనం నుండి విముక్తుల్ని చేసి – సామాజికంగా, వైయుక్తికంగా, మానసికంగా, లైంగికంగా సంపూర్ణ ఆనందాన్ని అందించే వరంగా తమ దాంపత్యాన్ని తీర్చిదిద్దుకొంటారు.

వేగంగా వచ్చిపడే వయస్సు మన ప్రమేయం లేకుండానే మన శరీరాన్ని బాల్యదశ నుండి యవ్వనదశకు, కౌమార దశకు, వృద్ధాప్యానికి నెట్టి వేస్తుంటుంది. అందుకనుగుణమైన రీతిలో మన ఎప్పటికప్పుడు మనం నిర్వర్తించే పాత్ర కనుగుణమైన పరిణతి యధాలాపంగా, యాంత్రికంగా దానంతటదే లభించదు. జీవితంలోనే ప్రతిదశలోను నూతన అవగాహన సాయంతో మానసిక ఎదుగుదలను కనపరిచినప్పుడు మాత్రమే ఇది సాధ్యమవుతుంది. తమ దాంపత్యాన్ని గురించి అద్భుతంగా ఊహించుకొంటూ, ఎన్నో మధురపుటూహలతో పరవశించిపోయిన యువతీయువకులు చాలమంది వివాహం చేసుకొన్న తరువాత తమ దాంపత్యజీవితం తాము కలలుకన్నంతటి మధురంగా లేదని గుర్తించుతారు. ఈ సందర్భంలోనే తమకెదురైన నిరాశానిస్పృహలు, అశాభంగాలు చూసి తాము జీవితంలో ఏదో కోల్పోయామన్న వెలితిని తమ మదిలో

నింపుకొంటారు. ఇందుకు భిన్నంగా మధురస్వప్నాలనుకనే తొలి యవ్వనదశను దాటి తాము దాంపత్యజీవితంలోకి ప్రవేశించామని గుర్తించుతూ–ఇప్పుడిక తమ దాంపత్యాన్ని మధురాతిమధురంగా రూపొందించుకోవడమెలా అని ఆలోచించే దంపతులు మాత్రమే ఖచ్చితమైన మానసిక ఎదుగుదల కనపరచుతున్నారని గుర్తించాలి.

తమ అంతరంగిక సహచరులలో తాము ఇష్టపడే, తమకు ఆనందం కలిగించే అంశాలు అనేకం వున్నట్లే, వారిలో తాము ఆమోదించలేని లక్షణాలు కూడా వుండవచ్చు. తమకు అనేక సన్నివేశాలు పారవశ్యం కలిగించినట్లే, అనేక సంఘటనలు తమను నిస్పృహకు లోనుచేయవచ్చు. తమ జీవితంలో ఆశాభంగాలు ఎదురుకావనిగాని, ఎవరైనా తమ సహచరులు లోపరహితంగా వుంటారనిగాని, భావించడం భావ్యంకాదు.

తమ సహచరులను యధాతధంగా ఆమోదించి, ఆభిమానించి, అరమరికలు లేని ప్రేమానురాగాలను అందించకలిగినప్పుడు ఎదుటి వ్యక్తి ఉన్నత లక్షణాలతోను, లోపాలతోను సంబంధంలేని అద్భుతమైన ప్రేమానుబంధం దంపతులిద్దరి మధ్యా నెలకొంటుంది.

వేగంగా కదలిపోయేకాలం ఈ సమాజపు రూపురేఖల్ని ఎప్పటికప్పుడు మార్చి వేస్తుంటుందన్న ప్రాథమిక సత్యాన్ని దంపతులు మున్ముందుగా గుర్తించాలి. మార్పుకులోనుకాకుండా ఎవ్వరూ తప్పించుకోలేరు. తమ అభిప్రాయాలు, తమ ప్రవర్తన అలాగే తమ సహచరుల అభిప్రాయాలు, ప్రవర్తన, చుట్టూ ఉన్న వ్యక్తులు, వారితో సంబంధబాంధవ్యాలు, స్థితిగతులు, ఎప్పటికీ స్థిరంగా, ఒకేలాగా మిగలబోవని ఎప్పటికప్పుడు మార్పు వచ్చిపడుతుంటుందని, అది జీవనధర్మమని గుర్తించకలిగిన దంపతులు – ఇలా వచ్చే ప్రతి మార్పును తమకు అనుకూలంగా మలచుకోకలుగుతారు. తాము సైతం మారకలుగుతారు.

నిరంతరం ఉత్తేజపూరితంగా, సంతోషభరితంగా దాంపత్య జీవితాన్ని సాగించడమెలా అని చాలా మంది ప్రశ్నిస్తుంటారు. తమ దాంపత్యాన్ని మధురానుభవాల మాలికగా తీర్చిదిద్దుకోవడంగాని, దు:ఖభాజనంగా మార్చుకోవడంగాని తమ చేతుల్లోనే వుందని దంపతులందరూ మున్ముందుగా గుర్తించాలి. వివిధ సందర్భాలలో తాము గైకొనే నిర్ణయాలే తమ సంసారం ఎలా రూపుదిద్దుకోవడానికైనా మూలకారణాలవుతాయని గుర్తించిగలిగిన దంపతులు అన్ని సమయాలలోను సరైన నిర్ణయాలు తీసుకోవడానికి

ప్రయత్నిస్తారు. తమ దాంపత్యం ఎల్లవేళలా సంతోషదాయకంగా వుండి తీరాలన్న దృఢ నిశ్చయం, అలా సంతోషదాయకంగా తీర్చిదిద్దుకోవడానికై తాము ప్రయత్నించితీరాలన్న చైతన్యం, తమ దాంపత్య జీవితంలో ఎదురయ్యే నూతన అనుభవాలనుండి ఎప్పటికప్పుడు కొంగ్రొత్త పాఠాలు నేర్చుకొంటూ ప్రతి అనుభవాన్ని తమ దాంపత్యాన్ని పరిపుష్టం, శోభాయమానం చేసేదిగా తీర్చిదిద్దుకోవాలన్న స్పష్టమైన అవగాహన దాంపత్యాన్ని స్వర్గధామంగా మార్చివేస్తాయి.

దాంపత్యంలో ఎదురయ్యే ఏ సమస్య అయినా అకస్మాత్తుగా ఎక్కడనుండో ఊడిపడదు. ఆయాసమస్యలు విపరీతస్థితికి ఎదగడానికి, తమకెంతో క్లేశం కలిగించడానికి తగిన బీజాలను భార్యాభర్తలిద్దరూ గాని, ఏ ఒక్కరు గాని తమ దాంపత్యంలో ఎప్పుడో నాటి వుంటారు. ఆ తరువాత ఒకరిపట్ల మరొకరు సరైన అవగాహనను పెంపొందించుకోలేక ఆయా సమస్యలను అచేతనంగా పెంచి పోషిస్తుంటారు. తరువాత ఎంతక్లిష్టమైన గణిత సమస్యనైనా కొన్ని మూలగణిత సూత్రాల సాయంతో పరిష్కరించుకోగల రీతిలో తమ దాంపత్యసమస్యలను సైతం పరిష్కరించుకోగల ఉపాయాలకోసం చాలమంది ఎదురుచూస్తుంటారు. ఇటు వంటి చిట్కాల కోసం ఈ గ్రంధం చదవబోతే నిరాశేమిగులుతుంది. అలాగే ఇందులో పంక్తులు, పేరాలే కనిపిస్తాయి. అలాకాకుండా ఈ గ్రంధం సాయంతో తమ జీవితానుభవాన్ని సుస్సంపన్నం చేసుకోవాలని నిర్ణయించుకొంటే తమ పాత అభిప్రాయాలన్నీ నూతన ఆలోచనలుగా రూపుదాల్చుతాయి. క్రొత్త జీవితాన్ని ఆవిష్కరిస్తాయి.

***అ**న్యోన్యంగా, ఆనందమయంగా దాంపత్యాన్ని చివరివరకు కొనసాగించడం, ఈ జీవితంలోనే ప్రతి ఒక్కరూ తమంతట తాము సాధించకలిగిన అపూర్వవిజయంగా పేర్కొనవచ్చు. అంతే కాదు, దంపతులిరువురి మధ్యా నెలకొనే అనురాగం కేవలం భార్యాభర్తలకే పరిమితం కాకుండా, అది క్రమంగా విస్తరించుతూ, విస్తృతమవుతూ ఒక అనురాగ శక్తిగా మారి తమ కుటుంబ సభ్యుల్ని, స్నేహితుల్ని, సన్నిహితులందరినీ ఆవహించుతుంది. భావితరాలను ప్రభావితం చేస్తుంది.*

- సి. నరసింహారావు

అన్యోన్య దాంపత్య దీపిక

అన్యోన్య దాంపత్యం - 1

1. దాంపత్య జీవితంలోకి అడుగిడబోతున్నారా? ..14
2. దాంపత్య జీవితం ఎలా వుండాలనుకుంటున్నారు? ..19
3. దాంపత్యాన్ని మధురానుభవాల మాలికగా మార్చుకోవచ్చు ..27
4. దాంపత్యంలోకి ప్రవేశించగల పరిణతి వుందా? ..32
5. దాంపత్యంలోకి అడుగిడగల పరిణతి లక్షణాలేమిటి? ..35
6. వైవాహిక జీవితం పట్ల మీకు ఏయే అభిప్రాయాలున్నాయి? ..38
7. రెండు భిన్న వ్యక్తిత్వాల సమాగమే దాంపత్యం ..44
8. కాబోయే భర్తలెలా వుండాలని యువతులు అభిలాషిస్తారు? ..51
9. దాంపత్య జీవితంలోకి ప్రవేశించే మగవారి ఆలోచనలెలా వుంటాయి? ..58
10. తమ సహచరులనుండి భార్యాభర్తలు ఏం ఆశిస్తారు? ..63

అన్యోన్య దాంపత్యం - 2

1. దాంపత్య జీవితాన్ని అన్యోన్యంగా రూపొందించుకోవడమెలా? ..70
2. తెలివైన భార్యలు తెలుసుకోదగ్గ విషయాలేమిటి? ..79
3. భర్తల ప్రవర్తన ఎలా వుండాలని భార్యలు ఎదురు చూస్తుంటారు? ..83
4. భర్తలు అసలెలా ప్రవర్తిస్తుంటారు? ..89
5. అచేతనంగా తమ ప్రవర్తనతో సహచరులను ఎలా కలవరపరుచుతుంటారు? ..94
6. భార్యా భర్తలు ఒకర్నొకరు పూర్తిగా అవగాహన చేసుకోగలరా? ..99
7. భార్యాభర్తలు ఆందోళనకు, అభద్రతాభావనకు ఎందుకు లోనవుతుంటారు? ..107
8. గృహిణులను తేలిగ్గా అలసటకు లోను చేసే అంశాలేమిటి? ..111
9. సంసారిక జీవితాన్ని ఓ మధుర స్వప్నంలా తీర్చిదిద్దుకోవడానికి తగిన ప్రాతిపదికలేమిటి? ..115
10. దాంపత్య జీవితంలో పరిణతి ప్రదర్శించే వారి ప్రవర్తన ఎలా వుంటుంది? ..119

అన్యోన్య దాంపత్యం - 3

1. దాంపత్యంలో ఘర్షణలు ఎందుకు, ఎలా ప్రారంభమవుతాయి? ..122
2. భార్యాభర్తలు కలహించుకోవడానికి కారణాలేమిటి? ..130
3. దంపతులు తమ కలహాలనెలా మలచుకోవచ్చు? ..135
4. భార్యాభర్తలెలా వాదించుకోవాలి? ..144
5. దాంపత్యంలో కలతనెలా నివారించుకోవచ్చు? ..149
6. దంపతులు తమ కలతలను సున్నితంగా పరిష్కరించుకోవడమెలా? ..155
7. భర్తలలో వచ్చే మార్పు భార్యలనెలా కలవరపరుస్తాయి? ..160
8. కలతల కాపురంలో సర్దుబాట్లు చేసుకోవడమెలా? ..166
9. ప్రతి భార్య గుర్తించాల్సిన అయిదు అంశాలు ..171
10. కొందరు భార్యలు తమ భర్తలను నిరంతరం ఎందుకు వేధిస్తుంటారు? ..172
11. సాధించి, వేధించే భార్యలలో మార్పు ఎలా వస్తుంది? ..180
12. దాంపత్యంలో సఖ్యత ఎలా సాధ్యపడుతుంది? ..186
13. భార్యాభర్తలు ఒకరిపై మరొకరు చేసే ఆరోపణలు ఎలా వుంటాయి? ..195
14. అత్తాకోడళ్ళ మధ్య కలతలు ఎప్పుడు,ఎందుకు,ఎలా మొదలవుతాయి? ..198

అన్యోన్య దాంపత్యం - 4

1. దాంపత్యంలో తొలి లైంగికానుభావాలను ఎలా రూపొందించుకోవాలి? ..226
2. నూతన దంపతులు గుర్తించుకోవలసిన అంశాలేమిటి? ..230
3. ప్రేమ భావన బలంగా వుంటే లైంగిక సమస్యలేవీ దరిజేరవు ..234
4. స్త్రీల లైంగిక స్వభావం తమకు భిన్నమైనదని మగవారు ముందుగా గుర్తించాలి ..237
5. పాతివ్రత్యం అంటే పాత అర్థం మారిపోతోంది ..241
6. దంపతులు తమ లైంగిక ఆకర్షణ క్షీణించకుండా కాపాడుకోవడమెలా? ..248
7. దాంపత్య జీవితం సంతోషంగా సాగడానికి లైంగికానందమే ప్రధానంకాదు..254
8. భర్త తన లైంగిక శక్తి క్షీణించిందని మధన పడుతుంటే, భార్య అతని ఇబ్బందిని అతి తేలికగా సరిచేయగలదు ..259
9. వివాహితులు ఏయే కారణాలవలన అక్రమ సంబంధాలు నెలకొల్పుకొంటారు? ..262
10. అక్రమ సంబంధాలు దాంపత్యంలో సంక్షోభాలనెలా సృష్టిస్తాయి? ..271
11. భార్యభర్తల మధ్య లైంగిక సఖ్యత ఎలా సాధ్యమౌతుంది? ..278
12. భర్త లైంగిక అసమర్థతను భార్యలెలా వైదొలగించగలరు? ..281

తమ తల్లితండ్రులు, ఇతరులు దాంపత్య జీవితాన్ని ఎలా కొనసాగిస్తున్నారో ప్రతి ఒక్కరూ చిన్న తనం నుండీ సన్నిహితంగా గమనిస్తూనే వున్నా తీరా వివాహమాడే సమయానికి అందరూ అనిశ్చిత భావనకు లోనవుతారు.

తమ దాంపత్య జీవితం ఎలా వుండబోతుందో, వివాహం తమ జీవితంలో ఏయే మార్పులు కొనితెస్తుందో, తమ ఆలోచనా ధోరణిలో, తమ వ్యక్తిత్వంలో చోటు చేసుకోవలసిన మార్పులేమిటో,తమ దాంపత్యానుబంధాన్ని మధురానుభావాల మాలికగా ఎలా మలచుకోవాలో ముమ్ముందుగా ఏ ఒక్కరూ స్పష్టంగా గుర్తించలేక పోవచ్చు.

వైవాహిక జీవితంపట్ల ఇంతవరకూ తమకున్న తప్పు అభిప్రాయాలన్నింటిని వైదొలగించుకొని, నూతన అవగాహనతో, తమ జీవితంలో చోటుచేసుకోనున్న కొంగ్రొత్త మార్పులకు సంసిద్ధం అవుతూ, దాంపత్యానుబంధాన్ని తమ జీవితానికి పరిపూర్ణత కలిగించేలా తీర్చిదిద్దుకోవడానికి ప్రతి ఒక్కరూ సమాయత్తం కావాలి.

దాంపత్య జీవితంలో నూతనానుభవాల్ని, నూతన అవగాహనను సంతరించుకొంటూ క్రమంగా ఓ నూతన వ్యక్తిత్వాన్ని సంతరించుకోవడానికి, తమ నిజవ్యక్తిత్వానికి మెరుగులు దిద్దుకోవడానికి దంపతులు నిరంతరం యత్నిస్తుంటారు.

దాంపత్య జీవితంలోకి అడుగిడబోతున్నారా ?

"పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకొంటాము. తరువాత దాంపత్య జీవితం ఎలా వుంటుందన్నది అదృష్టం పైన ఆధారపడి వుంటుంది." సాధారణమైన రీతిలో వైవాహిక జీవితంలోకి అడుగిడేవారు ఇలాగే భావించుతారు. ముందుగా పరిచయం వుండి ప్రేమించి పెళ్ళి చేసుకొనేవారు కూడా దాదాపు ఇదేరకమైన ఆలోచనా ధోరణిని వ్యక్తం చేస్తారు. "తీవ్రమైన ఆకర్షణకు, నిగ్రహించుకోలేనంతటి ప్రేమానుభూతికి లోనయ్యాను. అందరినీ కాదని ఈ వివాహానికి సమకట్టాను.మా దాంపత్యం సంతోషప్రదంగా వుంటుందా లేదా అన్నది అదృష్టంపైనే ఆధారపడి వుంటుంది."

ఈ రకమైన అభిప్రాయాలను ప్రతి ఒక్కరూ ప్రకటిస్తుంటారు. అంటే తమ వైవాహిక జీవితం ఫలానా రీతిలోనే వుంటుందని ముందుగానే ఖచ్చితంగా నిర్ణయించడం సాధ్యం కాదని భావిస్తుంటారు. అలాగే తమ వైవాహిక జీవితం ఎలా వుంటుందని, తాము ఎటువంటి యువతిని, లేక యువకుడ్ని సహచరులుగా స్వీకరించాలని చాలమంది అవివాహితులు సైతం ప్రశ్నిస్తుంటారు.

అదృష్టం, దురదృష్టాలు కావు

వైవాహిక జీవితం ఎలా వుండబోతుందో ముందుగానే అంచనా కట్టవచ్చు. ఎటువంటి వ్యక్తిత్వ లక్షణాలు వున్నవారు వైవాహిక జీవితంలో బాగా ఇమిడిపోగలరో నిర్ణయించవచ్చు. దాంపత్యజీవితాన్ని నిర్ణయించేవి తమ వ్యక్తిత్వ లక్షణాలే తప్ప అదృష్ట దురదృష్టాలు మాత్రం కావు.

ప్రేమికులు చాలా మంది తమ సహచరుల అలవాట్లు, వారి ప్రవర్తన వివాహమైన తరువాత ఎంతగానో మారిపోయిందని ఆరోపించబోతారు. తాము ప్రేమించుకొంటున్న సమయంలో వ్యక్తంకాని లక్షణాలిప్పుడు వారిలో చోటుచేసుకొన్నాయని నివ్వెరపోతారు. పెళ్ళియిన తరువాత, వారి వ్యక్తిత్వమే నూతనంగా రూపొందిందని చాలా మంది అనుకొంటారు. కాని వివాహం వలన వ్యక్తిత్వ స్వరూపం ఏమీమారదు.

సహజ వ్యక్తిత్వమే ప్రవర్తనలో వ్యక్తమవుతుంది

ఇలా ప్రేమించుకొనే సమయంలో తమ సహజలక్షణాలు వ్యక్తం కాకుండా ప్రేమికులు జాగ్రత్తపడుతారు. ఎదుటివారు తమ వ్యక్తిత్వాన్ని ఎక్కడ ఇష్టపడరోనన్న సంశయంతో చాలా జాగరూకతతో వ్యవహరించబోతారు. కాని వివాహం చేసుకున్న తరువాత సహజంగా, పూర్వంలా ప్రవర్తిస్తారు. ఈ ప్రవర్తన క్రొత్తగా అలవడిందని సహచరులు పొరపాటుగా భావించుతారు. అలాగే వివాహమైన తరువాత యువకులు తమపై పూర్వంలా శ్రద్ధ కన్పరచడంలేదని తమను నిర్లక్ష్యం చేస్తున్నారని వారి తల్లితండ్రులు అనుకొంటుంటారు. అది సరికాదు. ఇంతవరకూ తల్లితండ్రులపై క్రోధభావన మదిలోవున్నా వారు దాన్ని వ్యక్తం చేసి వుండరు. ఇప్పుడు దాన్ని వ్యక్తం చేయకల్గుతున్నారు.

వివాహమైన తరువాత దంపతులలో మార్పేమీ వుండబోదన్న నిర్ణయానికి రావడం తప్పు. దాంపత్య జీవితంలో నూతనానుభవాల్ని, నూతన అవగాహనను సంతరించుకొంటూ క్రమంగా ఓ నూతన వ్యక్తిత్వాన్ని సంతరించుకోవడానికి, తమ నిజవ్యక్తిత్వానికి మెరుగులు దిద్దుకోవడానికి దంపతులు నిరంతరం యత్నిస్తుంటారు. కాని ఈ మార్పు క్రమబద్ధంగా, సంవత్సరాల తరబడి చోటుచేసుకొంటుంది.

ఈ మార్పులు సైతం ఊహించలేని రీతిలో వుండబోవు. వివాహానికి ముందు వున్న అభిలాషలు, ప్రేరణలను పూరించుకోవడానికే ఈ మార్పు తోడ్పడుతుంది. దాంపత్య జీవితంలోకి క్రొత్తగా అడుగిడనున్నవారు తమ సహచరులను ఎంచుకొనే సందర్భంలో ఈ అంశాలను గుర్తించాలి. వారిలో తమకు నచ్చని లక్షణాలను వివాహమైన తరువాత మార్చవచ్చనుకోవడం పొరపాటు.అసలు తమలో దాంపత్యానికి దోహదంచేసే సవ్యమైన లక్షణాలేమిటో,దాంపత్యానికి హాని కల్గించేవేమిటో మందుగా గుర్తించాలి. అలాగే తాము ప్రేమిస్తున్న యువతిలో దాంపత్యానుకూల లక్షణాలు ఏస్థాయిలో వున్నాయో గుర్తించడానికి యత్నించాలి.

యువతుల దాంపత్యానుకూల లక్షణాలు

కొంతమంది దాంపత్యానుకూలమైన లక్షణాలను ప్రదర్శిస్తారు. మరి కొందరు

దాంపత్య విరుద్ధమైన వ్యక్తిత్వాన్ని సంతరించుకొని వుంటారు. దాంపత్యానుకూల లక్షణాలున్న వ్యక్తులు ఎటువంటివారిని వివాహమాడినా వారితో తేలిగ్గా సర్దుకుపోకల్గుతారు. ఒక ప్రఖ్యాత మనోవైజ్ఞానికుడుఅన్యోన్య దాంపత్యం సాగించే యువతుల వ్యక్తిత్వ సరళిని పరిశీలిస్తూ వారందరిలోను కొట్టవచ్చేట్లు కన్పించే కొన్ని లక్షణాలను పేర్కొన్నాడు. ఈ లక్షణాలు వున్న యువతులు దాంపత్యాన్ని ఎంతో సుఖప్రదంగా కొనసాగించకల్గుతారని తరువాత జరిగిన అనేక పరిశోధనలలో వెల్లడైంది.

వీరు 1) ఇతరులపట్ల సానుకూల, సామరస్య ధోరణిని వ్యక్తం చేస్తారు. సౌమ్యతను ప్రదర్శిస్తారు. 2) ఎదుటివారు కూడ తమపట్ల ఇటువంటి దృక్పథాన్నే వ్యక్తం చేయాలని అభిలషిస్తారు. 3)అతి తేలిగ్గా గాయపడరు. ఎదుటివారు నొప్పించేలా ప్రసంగించినా తేలిగ్గా రెచ్చిపోరు. 4) తాము ఇతరులపై ఎటువంటి ప్రభావాన్ని కలిగిస్తున్నామనిగాని, తమను ఇతరులను లెలా అవగాహన చేసుకొంటున్నారని ఎక్కువగా మధనపడదు. 5) తమకు తారసిల్లిన వారినందరినీ తమకు పోటీదారులుగా భావించరు. వారందరితోను తమను పోల్చుకొని చూడరు. 6) ప్రతి సందర్భంలోను ఇతరులతో సహకరిస్తారు. 7) ఇతరులనుండి సలహా సంప్రదింపులు గైకొనడానికి సంకోచించరు. ఇతరులు అనవసరమైన సలహాలు ఇవ్వబోయినా ఇబ్బందికి లోనుకారు. 8) ఇతరులకు తోడ్పడాలని, వీలైనంతమందికి సాయం చేయాలని ప్రయత్నిస్తారు. 9) ఇతరులకు ఆనందం కలిగించడానికి, ఇతరులు ఇష్టపడే పనులుచేయడానికి ప్రయత్నిస్తారు. 10) తమపై ఆధారపడిన వ్యక్తుల బాగోగులను పట్టించుకొంటారు. దీనస్థితిలో వున్నవారికి తోడ్పడే అవకాశాలను కల్పించుకొంటారు. 11) ఒక పద్ధతి ప్రకారం, క్రమశిక్షణతో, ఓర్పుగా ఎంతటి క్లిష్టమైన పనినైనా చేయడానికి యత్నించుతారు. 12) ఖర్చు విషయంలో చాలా జాగ్రత్తగా వుంటారు. డబ్బును పొదుపుగా వాడతారు. 13) ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ, జీవితం పట్ల ఆశావాద దృక్పథాన్ని ప్రదర్శిస్తుంటారు.

యువతుల దాంపత్య విరుద్ధ లక్షణాలు

దాంపత్య విరుద్ధలక్షణాలను ప్రదర్శించే యువతులు ఇందుకు భిన్నమైన వ్యక్తిత్వ సరళిని వ్యక్తం చేస్తుంటారు. ఇటువంటి వారందరిలోను కన్పించే లక్షణాలను ఈ క్రింది విధంగా క్రోడీకరించవచ్చు. 1) త్రీవమైన ఉద్రిక్తతను కన్పరుస్తారు. అతి స్వల్పసంఘటనకే తీవ్రస్థాయిలో మానసిక కల్లోలానికి గురవుతారు. 2) ఒక క్షణంలో తీవ్రమైన సంతోషాన్ని, మరుక్షణంలోనే గాఢమైన విచారాన్ని వ్యక్తం చేస్తారు. అతిప్రేమను కన్పరుస్తారు. అలాగే అమితద్వేషాన్ని ప్రదర్శిస్తారు. 3) అల్పత్వభావనను మదిలో ప్రతిష్టించుకొని తీవ్రమైన దురుసుతనాన్ని కన్పరుస్తారు. అకారణంగా ఇతరులపై విరుచుకు పడుతుంటారు. 4) తీవ్రమైన అసహనాన్ని కన్పరుస్తారు. స్వల్పస్థాయి మానసిక ఒత్తిడిని సైతం సహించలేక ఇతరులందరిని నిందించడానికి, నిర్దేశించడానికి యత్నిస్తారు. 5) దాంపత్య జీవితం తాము భరించలేనంతటి బాధాకరంగా వుంటుందనుకుంటూ ఇతర వ్యాసంగాలపై అధిక ఆసక్తి కన్పరుస్తారు. 6)వీలయినంతటి ఎక్కువమందితో పరిచయాన్ని కల్పించుకోవటానికి

ప్రయత్నిస్తారు. వారంతా తామంటే ఇష్టపడాలని, కాక తమను ప్రత్యేక వ్యక్తిగా పరిగణించాలని ఎదురు చూస్తారు. 7) తీవ్రమైన అతిశయాన్ని, అహంభావాన్ని ప్రదర్శిస్తారు. 8) దీనస్థితిలో వున్నవారిపట్ల సానుభూతిని ప్రకటించరు. సంక్షేమ కార్యక్రమాల్లో పాలుపంచుకోరు. కేవలం తమకు పేరు ప్రఖ్యాతులు రావడానికి మాత్రమే ఏ పనైనా చేయబోతారు. 9)తమను అందరూ అభినందించాలని, తమపట్ల విశేష ఆసక్తి కన్పరచాలని ఎదురు చూస్తారు. 10) మగవారిని సానుభూతితో, సహనంతో అర్థం చేసుకోవడానికి, వారితో కలసి తిరగడానికి ప్రయత్నిస్తారే తప్ప తోటి స్త్రీలపట్ల సామరస్య ధోరణిని వ్యక్తం చేయరు. 11) ఏ పనినీ ఓర్పుగా చేయలేరు.ఊరకనే అసహనానికి లోనవుతారు. 12) అతి జాగ్రత్తలు తీసుకునేవారినీ, ఒక పద్ధతి ప్రకారం తమ పనులను చేసుకొనేవారిని నిరసిస్తారు. 13) క్లిష్టమైనవని భావించే పనులన్నింటికీ దూరంగా వుండబోతారు. 14) తమ అభిప్రాయాలను, తమ దృక్పథాన్ని అందరిపైనా రుద్దడానికి ప్రయత్నిస్తారు.

యువకుల దాంపత్యానుకూల లక్షణాలు

ఇక దాంపత్యానుకూల లక్షణాలు ప్రదర్శించే మగవారి వ్యక్తిత్వ విశేషాలను ఇలా పేర్కొనవచ్చు. 1) స్థిరమైన, నిశ్చలమైన మానసికధోరణిని కన్పరుస్తారు.

2) ఇతరులతో సహకరించడానికి, సహాయాన్ని అందించడానికి సంసిద్ధంగా వుంటారు.

3) స్త్రీలను తక్కువగా చూడడం కాక వారిని సైతం సమాన స్థాయిలో పరిగణిస్తారు.

4) తమపై ఆధారపడిన వారిపట్ల అత్యంత సానుభూతిని కన్పరుస్తారు.

5) తమను గురించి తాము మథనపడుతూ కూర్చోకుండా పదిమందితో స్వేచ్ఛగా కలసి తిరగడానికి ఇష్టపడతారు.

6) ప్రతి విషయంలోనూ చొరవను, ధైర్యాన్ని ప్రదర్శిస్తారు.

7) ఎంతటి క్లిష్టతరమైన బాధ్యతనైనా గైకొనడానికి సంసిద్ధమవుతారు.

8) ఇతరులపట్ల నిజమైన శ్రద్ధాసక్తులను కనపరుస్తారు.

9) ప్రతిపనిని ఒక పద్ధతి ప్రకారం క్రమశిక్షణతో చేస్తారు. ఇలా చేసే వారంటే ఇష్టపడతారు.

10) డబ్బు విషయంలో జాగ్రత్తగా, పొదుపుగా వ్యవహరిస్తారు.

11) ఎటువంటి అభిప్రాయాలనైనా తేలికగా కొట్టిపారవేయరు. సాను భూతితో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు.

12) సాంప్రదాయ బద్ధమైన నైతిక విలువలను, లైంగిక నియమాలను సమర్థిస్తారు.

యువకుల దాంపత్య విరుద్ధ లక్షణాలు

దాంపత్య విరుద్ధ లక్షణాలను ప్రదర్శించే మగవారి వ్యక్తిత్వ ధోరణి, ఈ కోవకు చెందిన స్త్రీల ప్రవర్తనకు దగ్గరగా వుంటుంది. ఈ లక్షణాలన్నిటినీ ఇలా పేర్కొనవచ్చు.

1) అస్తవ్యస్తమైన ఆలోచనా ధోరణితో ఏ క్షణంలో వీరు ఏంచేస్తారో అంతుపట్టదు.

2) పది మందితోనూ స్వేచ్ఛగా కలవలేకపోతూ, తమను ఇతరులతో పోల్చి చూసుకొంటూ ఆత్మన్యూనతా భావనకు లోనవుతుంటారు.

3) ఇతరుల అభిప్రాయాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, తమకు వ్యతిరేకంగా ఎవరేం

చెప్పినా తీవ్రంగా చలించిపోతుంటారు.

4) పది మంది దృష్టినీ ఆకర్షించడానికి, ఇతరుల గుర్తింపు పొందడానికి సిగ్గుపడిపోతుంటారు.
5) తీవ్రమైన అభద్రతా భావనను మదిలో ప్రతిష్టించుకొని, ఇతరులందరిపైనా అధికారం చెలాయించడానికి అలవాటు పడిపోతారు.
6) స్త్రీలపైన, బలహీనులపైనా పెత్తనం చెలాయించడానికి,తమక్రింద పనిచేసేవారిని తక్కువగా, హీనంగా చూడడానికి అలవాటు పడిపోతారు.
7) ఇతరుల క్రింద పనిచేయడానికి ఇష్టపడతారు. తమకంటే అధికులని భావించే వారితో పోటీపడటానికి సాహసించలేరు.
8) ఎక్కువగా పగటికలలను ఆదరిస్తుంటారు. అందరిపైనా ఆధిక్యతను సంతరించుకోకల్గినట్లు స్వైరకల్పనను సృష్టించుకొంటారు.
9) తమ అలవాట్లలోగాని, పనిచేసే తీరులోగాని క్రమ పద్ధతిని ఇచ్చగించరు.
10) ఓర్పుగా, క్లిష్టమైన పసులు చేయాలంటే విసుక్కొంటారు.
11) డబ్బు పొదుపు చేయడమంటే మండిపడతారు.
12) ఎక్కువకాలం ఇంటిబయట గడపడానికి ఇష్టపడతారు.
13) ఎక్కువమంది ఆమోదించే రాజకీయ విధానాలను, మత విశ్వాసాలను త్రోసిపుచ్చబోతారు.
14) లైంగిక విలువలపట్ల, ఇతర విషయాలపట్ల గత కాలపు సామాజిక నియమాలను నిరసిస్తారు.

పైనపేర్కొన్న నాలుగు రకాల వ్యక్తిత్వధోరణులలో విరుద్ధలక్షణాలను కన్పరచే స్త్రీలుగాని, మగవారుగాని-ఇతరులతో స్నేహం చేయలేని, ఎవ్వరికీ సన్నిహితం కాలేని మనోస్థితి సంతరించుకొన్నారని గుర్తించవచ్చు. ఇతరులతో స్నేహం చేయగల వ్యక్తి, స్నేహితుల మధ్య కాలం గడపడానికి ఆసక్తి చూపించే వ్యక్తి దాంపత్యానుబంధం నెలకొల్పుకొన్న తరువాత సుఖప్రదమైన వైవాహిక జీవితాన్ని గడపగలడు.

ప్రవర్తనా సరళిని సవరించుకోవచ్చు

మన దేశంలో ప్రేమ వివాహాల శాతం చాలా తక్కువ. పెద్దలు నిర్ణయించిన రీతిలో, తమకింతకుముందు పరిచయంలేని వారిని వివాహం చేసుకోవడం వలన, తమ జీవిత సహచరులు కాబోయే వారితో, తమ దాంపత్యజీవితం సవ్యంగా వుంటుందో లేదో ముందుగా నిర్ణయించుకోవడం సాధ్యపడదు, కాని ప్రేమించి పెళ్ళి చేసుకొనే వారి శాతం అతి తక్కువగానే వున్నా, వారిలో సైతం ఇటువంటి అవగాహన వుండడం లేదు. ఎవరైనా, ఏ వయస్సులోనైనా తమ ప్రవర్తనా సరళిని సవరించుకోవచ్చు. తమ దాంపత్య జీవితాన్ని దెబ్బతీసే లక్షణాలను సవ్యంగా గుర్తించితే, ఆ తరువాత వాటిని సవరించుకోవడం అతి సులభసాధ్యమవుతుంది.

ఎటువంటి అడ్డంకులు ఎదురైనా అధిగమించగలమన్న పట్టుదల, ఆత్మవిశ్వాసం కన్పర్చచినవారు తమ దాంపత్య జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులకు తేలిగ్గా తట్టుకోకలుగ్గుతారు.

దాంపత్య జీవితం ఎలా వుండాలనుకొంటున్నారు ?

తమ చదువు పూర్తిచేసి ఉద్యోగాలలోనో, వృత్తిలోనో, స్థిరపడుతున్న యువతీయువకులు ప్రేమ వివాహాలపట్ల అధికాసక్తి చూపుతున్నారు. తల్లితండ్రులు సూచించిన రీతిలో వివాహానికి అంగీకరించడం తమ వ్యక్తిత్వానికి భంగకరమని వారు భావిస్తున్నారు.ఇక ఈ ప్రేమ వివాహాలను వ్యతిరేకించే వారు ఒక అంశాన్ని పదే పదే పేర్కొంటుంటారు. ప్రేమించి వివాహం చేసుకొన్న దంపతులలో చాలా మంది ఒక్క ఆరునెలలు గడవకముందే కలతల వలయంలో చిక్కుకోవడానికి కారణమేమిటని వారు ప్రశిస్తారు. సంప్రదాయక వివాహాలు సజావుగా సాగిపోతుంటే ప్రేమ వివాహాలు ఎందుకు విఫలమవుతున్నాయంటారు. ప్రేమ వివాహాలు అనుసరణీయం కావని తేల్చి చెబుతుంటారు.

ప్రేమలో చిక్కుకున్న యువతీ యువకులు తాము దాంపత్య జీవితాన్ని అన్యోన్యంగా గడపగలమో లేదో ముందుగానే తేల్చుకోగల అవకాశం వుందా? ఆ అవకాశం వుందని ఆధునిక మనోవైజ్ఞానికులు పేర్కొంటున్నారు. తామిద్దరమూ కలసి మధురమైన జీవితాన్ని గడుపగలమో లేదో ప్రేమికులు ముందుగానే నిర్ణయించుకోవచ్చు.

ప్రేమ పారవశ్యంలోవున్నా గుర్తించుకోవలసిన అంశాలు

ఇద్దరు వ్యక్తుల మధ్య ప్రేమానుబంధం నెలకొనే సమయంలోనే వారిద్దరిమధ్య వైరుధ్యాలు కూడా తలెత్తవచ్చు. ప్రేమ పారవశ్యంలో చిక్కుకున్న యువతీ యువకులు ముందుగా వీటిని గుర్తించకుండా దాంపత్య జీవితంలోకి అడుగిడితే, తరువాత వారు ఎంతో క్షోభకు గురికావలసి వుంటుంది. అందుకే తాము జీవితంలో ఒక ముఖ్యమైన నిర్ణయాన్నిగైకొనే సయమంలో తమ మధ్య నెలకొంటున్న అనుబంధాన్ని అన్ని కోణాలనుండి సవ్యంగా అంచనా వేయడం నేర్చుకోవాలి. విఫలమైన ప్రేమవివాహాలలో ముందుగానే ఆయా చిహ్నాలు కన్పించుతాయి. వాటిని ప్రేమికులు ముందుగానే గుర్తించకలిగితే, మరింత ముందుకు సాగకుండా, వివాహానుబంధంలో చిక్కుకోకుండా జాగ్రత్త పడగలుగుతారు.

తొలిచూపులోనే ప్రేమించేశామని చెప్పే వ్యక్తులకు ఎదుటివారిలో తమకు సరిపడని అంశాలను గుర్తించడం సాధ్యపడకపోవచ్చు. ఒకరినొకరు అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించుతుంటే తమ మధ్య భవిష్యత్తులో వైరుధ్యాన్ని కల్పించగల సూచనలను ముందుగానే గుర్తించడం వీలవుతుంది. మోహావేశంలో చిక్కుకున్నవారికి లైంగిక దృష్టి తప్ప వేరొకటి వుండకపోవచ్చు. కాని పూర్తి ఆత్మవిశ్వాసం, మానసిక పరిణతిగల వ్యక్తులు తమ మధ్య నెలకొంటున్న అనుబంధాన్ని సవ్యంగా అంచనా వేసుకోకలుగుతారు.

ప్రేమ కలహాల ప్రాధాన్యత

ప్రేమ కలహాలు తమాషాగా, ఉత్తేజపూరితంగా వుంటాయని, ప్రేమికులు ఒక నిముషంలో తీవ్రంగా కలహించుకొని మరు నిముషంలోనే పూర్తిగా సర్దుకుపోతారని చాలామంది భావించుతుంటారు. ప్రేమికుల మధ్య చెలరేగే కలహాలకు ఎనలేని ప్రాధాన్యత వుంది. భవిష్యత్తులో తమ దాంపత్య జీవితాన్ని సంక్షోభంలో ముంచగల శక్తి వీటికి వుంటుంది. ఇద్దరిమధ్యా నెలకొన్న అనుబంధం తమ వైయుక్తిక, మానసిక అవసరాలను తీర్చేదిగా లేకపోతే ఇద్దరి మధ్యా కలహాలు చెలరేగవచ్చు. తాము అభిలషించిన రీతిలో ఎదుటివారు ప్రవర్తించకపోయినా, లేక తమ అభిలాషలను వారు ఖాతరు చేయకపోయినా ఇలా కలహాలు ప్రారంభం కావచ్చు. సుధాకర్ ఆత్మన్యూనతకు లోనయ్యాడు. తనను చుట్టూ వున్నవారు అభినందించాలని, తన ప్రత్యేకతను గుర్తించాలని ఎదురుచూస్తుంటాడు. అతను ప్రేమించిన యువతి ఎప్పుడూ తన కుటుంబ విషయాలు, తన సమస్యలు ఏకరువు పెడుతుందే తప్ప అతడి గురించి పట్టించుకోదు. అతనిపట్ల పెద్దగా ఆసక్తి కనపరచదు. ఇలా కొద్దికాలం గడిచింది. ఆమె తన కుటుంబ విషయాలు ఏకరువు పెట్టడం ప్రారంభించగానే అతను తీవ్రమైన చికాకుకు లోనయ్యేవాడు. అనవసరంగా కలహానికి దిగేవాడు. కాని సుధాకర్ ఆ యువతిని వివాహమాడితే వారు జీవితంలో సర్దుకుపోవడానికి పెద్దగా ఇబ్బంది పడనవసరం వుండదు ఇద్దరూ, ఎదుటివారు తమ మానసిక అవసరాలు తీర్చగలరని అనుకొంటున్నారు.

మదిలోని కల్లోలమే కారణం

కొందరు తమ మానసిక కల్లోలానంతటిని ఎదుటివారిపై ప్రదర్శించబోతారు.

తమ మదిలో గూడుకట్టుకున్న క్రోధాన్ని వెలువరించడానికై తమ సహచరులను ఒక సాధనంగా వాడుకొంటారు. ఇటువంటి వ్యక్తితో వివాహం ఖచ్చితంగా విఫలమవుతుంది. సురేంద్ర, మిథులలు ప్రేమించుకొన్నారు. ఒక్క నెలరోజులు గడవకముందే వాళ్ళు తీవ్రంగా కలహించుకోవడం ప్రారంభించారు. వాళ్లు అసలు ఏ విషయంపైన ఇలా కలహించుకొంటున్నారో వారే గుర్తించలేకపోయేవారు. సురేంద్ర ఆమెను గాయపడేలా విమర్శించేవాడు. ఆమె కళ్ళ నీరు పెట్టుకొనేవరకు ఏవేవో అనేవాడు. మిథులకు అతనెందుకిలా ప్రవర్తిస్తున్నాడో అర్థమయ్యేదికాదు. సురేంద్ర చిన్నతనంనుండి అనేక ఆర్థిక ఇబ్బందులకు లోనయ్యాడు. స్వయంకృషితో పైకి రావాలని, జీవితంలో ఉన్నతస్థానాన్ని అందుకోవాలని అభిలషించేవాడు. ఒక మెడికల్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇతను ఎంతకష్టపడినా, పైవాళ్ళు గుర్తించడంలేదు. పైగా అతని సహోద్యోగులు అతనిపై లేనిపోని ఆరోపణలు చేస్తుంటారు. అతను కష్టపడి పనిచేస్తుంటే ఇదంతా తమ ప్రతిభేనన్నట్లు వాళ్లు ప్రవర్తించే వారు. సురేంద్ర అవమానానికి లోనయినట్లు భావించేవాడు. అటువంటి సమయంలో మిథులతో అనవసర విషయాలపై తీవ్రంగా కలహించేవాడు. తన సహోద్యోగులపై పేరుకొన్న ఆగ్రహాన్నంతటిని ఆమెపై కురిపించే వాడు. తనకు ప్రమోషన్ వచ్చేవరకు అందరితోను జాగ్రత్తగా వుండాలనుకొంటూ, సహోద్యోగులపై తన కోపాన్ని చూపేవాడు కాదు.

మిథుల కూడా బాగా చదువుకొన్నది. ఆమెకు చికాకుకు, ఆగ్రహానికి లోనవ్వవలసిన అవసరమే వుండేదికాదు. ఆమె నిర్విచారంగా, సంతోషంగా అతనితో కూర్చుని ఏదో ఒక విషయం చెప్పబోయేది.సురేంద్ర ముందుగా తన మదిలోని చికాకు వ్యక్తం చేసేవాడు. ఆ తరువాత మిథుల ప్రవర్తనలో లోపాలెంచేవాడు. ఆమెకు ప్రపంచజ్ఞానమే లేదని ఆరోపించేవాడు. ఆ తరువాత ఆమె కట్టుకొన్న చీరనుండి, జుట్టుదువ్వుకొన్న విధానంవరకు ఎత్తిచూపుతూ హేళన చేసేవాడు. ఆమె నిర్ఘాంతపోయేది. అతనిలా మాట్లాడడం పూర్తిగా అనుచితమనుకొనేది. ఇక ఇద్దరి మధ్యా తీవ్రమైన కలహం తలఎత్తేది. మిథుల చీకూ, చింత లేకుండా తాపీగా వుండకల్గడాన్ని చూసి సురేంద్ర అనవసరంగా చికాకుకు లోనయ్యేవాడు. ఆమె ఇలా వుండడం వలన అతనిలో గూడుకట్టుకొన్న అభద్రతాభావన పెల్లుబికేది. ఆమె ఈ విషయాన్ని త్వరలోనే గుర్తించగల్గింది. తాను ఏమి మాట్లాడితే అతను రెచ్చిపోతాడోనని ఆమె చాలా జాగ్రత్తగా వుండాల్సి వచ్చేది. ఫలితంగా మిథుల ఆందోళనకు లోనయింది. అతని ఆగ్రహాన్ని, నిస్పృహను వెళ్ళగ్రక్కడానికి తనను ఒక ఉపకరణంగా అతను పరిగణిస్తున్నాడని, ఇటువంటి వ్యక్తితో కలసి జీవితాన్ని పంచుకోవడం అసాధ్యమని మిథుల నిర్ణయించుకోకలిగింది. వీళ్ళిద్దరు వివాహం చేసుకొంటే అది నరకంగా రూపొంది వుండేదని వేరే చెప్పనక్కరలేదు.

ప్రేమికులు ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకొని, ఒకరికి అనుగుణంగా ఒకరు సర్దుకుపోవడానికి ప్రయత్నించే సందర్భంలో ఇద్దరి మధ్యా ఏవైనా కలహాలు తలెత్తవచ్చు. ఇలా కలహాలు చెలరేగుతుంటే ఇవి తమ దాంపత్య జీవితంలోకి కూడా ఎగబ్రాకుతాయని వీరు గుర్తించాలి. ప్రేమ కలహాలని ముచ్చటపడే ఈ వైరుధ్యాలు తరువాత కుటుంబకలతలుగా పరిణమిస్తాయి.

ప్రేమించేటప్పుడు గుర్తించవచ్చు

కొంతమంది ప్రేమికులు మధ్యలో అకారణంగా విడిపోతారు. కొన్ని రోజులపాటు ఒకరినొకరు కలుసుకోరు. ఆ తరువాత మళ్ళీ పూర్వంలా వుండబోతారు. మధ్యలో ఇలావచ్చే ఎడబాటును తీవ్రవైరుధ్యానికి చిహ్నంగా, దాంపత్యాన్ని దెబ్బతీసే లక్షణంగా పరిగణించాలి. కొంతమంది ఇలా మధ్యమధ్యలో దూరం కాకపోవచ్చు. కానీ ప్రేమికురాలు అతనితో స్నేహం నెరపడం అంతమంచిది కాదేమోనని, విడిపోవడమే ఉత్తమమని భావించుతుంటే వారి ప్రేమానుబంధంలో ఖచ్చితమైన లోపం ఏదో వుందని నిర్ణయించాలి. తాము వివాహమాడవచ్చా. వివాహమాడితే ఆ తరువాత పరిణామాలు ఎలా వుంటాయోననే సందిగ్ధంతో, ముందు వెనుకల తటపటాయింపుతో సతమతమయ్యే ప్రేమికులు తమ దాంపత్యాన్ని అన్యోన్యంగా సాగించుకోలేరు.

ప్రేయసీ ప్రియులు తమ ప్రేమానుబంధం ఏ రీతిలో వుందో నిర్ణయించుకోలేక పోవచ్చు. కాని వారి స్నేహితులు, స్నేహితురాళ్లు వీరి మధ్య రాబోయే కల్లోలాన్ని ముందుగానే పసికట్టకల్గుతారు. ఈ వివాహం పొసగదని, విడిపోవడమే మేలని వారు హెచ్చరించితే ఆ హెచ్చరికలకు తగిన ప్రాధాన్యతనివ్వాలి. తమ నిజమైన స్నేహితుల హెచ్చరికలను ఖాతరు చేయకుండా, ఎటువంటి అడ్డంకులు ఎదురైనా అధిగమించగలమన్న పట్టుదల, ఆత్మవిశ్వాసం కనపరచి మొండిగా వివాహమాడినవారు తమ దాంపత్య జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులకు తేలిగ్గా తట్టుకోకలుగ్గుతారు. తమ సహచరులపట్ల ముందుగానే ఏవేవో అనుమానాలు పెంచుకొని వాటిని నివృత్తి చేసుకోవడానికి ప్రయత్నించనివారు దాంపత్యజీవితంలో ఏమీ సుఖపడలేరు. ఏది ఎలా వుంటుందో, ఏయే పరిణామాలు సంభవిస్తాయోనన్న సంశయాన్ని వెలిబుచ్చిన ప్రేమికులు దాంపత్య జీవితంలోకి అడుగిడిన తరువాత పేలవమైన సంసారజీవితాన్నే సాగించవలసివస్తుంది.

దాంపత్య జీవితం గురించి తలెత్తే ప్రతి అనుమానాన్ని ప్రమాద చిహ్నంగా గుర్తించలేము. ప్రేమికులందరు తమ భవిష్యత్తు ఎలా వుంటుందోనన్న ఆతురతకు లోనుకావడం సహజమే! ఏదో కొద్దిపాటి ఆతురతకు లోనవుతున్నారో, లేక నిజమైన అనుమానాన్ని మదిలో ప్రతిష్టించుకొన్నారో నిర్ణయించుకోవడమెలా? అందుకై తమ ప్రవృత్తిని ఒకసారి సమీక్షించుకోవాలి. తమ జీవితంలో వివిధ ఘట్టాలలో ఏమవుతుందోనన్న అనిశ్చిత భయానికి లోనుకాని వ్యక్తులు, తమ సామర్థ్యంపట్ల తమకు విశ్వాసంవుండి ఎంతటి క్లిష్టమైన నిర్ణయాలనైనా తీసుకోగల వ్యక్తులు, పూర్వ అనుభవాలను పురస్కరించుకొని తమ నిర్ణయాలు సవ్యమైనవేనని గ్రహించకల్గినవారు, తమ ప్రేమికుల విషయంలో ఇలా సందిగ్ధతకు లోనవుతుంటే, తమ ప్రేమవ్యవహారాన్నంతటిని మరోసారి పున:పరిశీలించుకోవాలి. తమకున్న అనుమానాలకు తోడు స్నేహితులు కూడా అనుమానాలను వెలిబుచ్చుతుంటే తమ మధ్య ఏదో లోపముందని గుర్తించాలి.

ఎదుటివారిని మార్చాలనుకోవడం సరికాదు

ప్రేమికులకు ఒకరిపట్ల ఒకరిపట్ల గౌరవభావం వుండాలి. ప్రేమించుకునే

సమయంలో ఎదుటివారిలో తమకు నచ్చని అంశాలు కన్పించవచ్చు. కాని, చాలామంది తమ అయిష్టతను పైకి వెల్లడించరు. వివాహమైన తరువాత ఎదుటివారిని తమకనుగుణంగా మార్చుకోవచ్చనుకొంటారు. ఎదుటివారి అలవాట్లను గుణగణాలను మార్చాలన్న అభిలాష ప్రేమికులలో బలంగా వుంటే, దీనిని వారి దాంపత్యానికి హాని కల్గించే అంశంగా గుర్తించాలి. ఇలా మార్చాలనుకునేవారు ఎదుటివారిపట్ల, వారి వారి అభిరుచులపట్ల పూర్తి సమ్మతిని వ్యక్తం చేయడంలేదని గుర్తించాలి. ఎదుటివారిలో ఏవేవో మార్పులు రాకపోతే వారితో కలసి సహజీవనం సాగించడం క్లిష్టతరమని భావించుతున్నారని గుర్తించాలి.

ఈ సందర్భంలోనే మరొక విషయాన్ని చాలామంది విస్మరిస్తుంటారు. ప్రేమించే వయస్సు వచ్చేసరికి మన వ్యక్తిత్వం ఒక స్పష్టమైన రూపు సంతరించుకొంటుంది. దీన్ని సవరించుకోవడం అంతగా సాధ్యపడదు. ఒక వేళ సాధ్యపడినా అందుకెంతో సమయం పడుతుంది. అంతేకాదు. మనందరిలోను కొన్ని మంచి లక్షణాలు వుండవచ్చు. అలాగే ఏవో కొన్ని బలహీనతలుండవచ్చు. ఇవన్నీ మన మన వ్యక్తిత్వాలలో భాగాలు. వాటిని మరొకరు బలవంతంగా మార్చబోవడం పూర్తిగా అసాధ్యం.

ప్రదీప్ ఎప్పుడు చలాకీగా వుండేవాడు. ఎంతోమంది స్నేహితులతో పరిచయాలు పెంచుకొనేవాడు. ఒక వ్యాపారం ప్రారంభించి అతి కొద్ది కాలంలోనే ఎంతో అభివృద్ధిని సాధించాడు. అతనికి, సుభద్రకు పరిచయం ఏర్పడి క్రమంగా అది ప్రేమగా పరిణమించింది. సుభద్ర అక్కకు ఇంకా సంబంధం కుదరకపోవడం వలన వెంటనే వారు వివాహమాడడానికి వీలుపడలేదు. ఒక రెండు సంవత్సరాలపాటు వీరిద్దరూ రోజూ కలుసుకొనేవారు.

ఈ మధ్యకాలంలో ప్రదీప్‌లో ఎంతో మార్పు వచ్చింది. అతనిలో ఆత్మవిశ్వాసం పూర్తిగా దెబ్బతిన్నది. ఏ నిర్ణయం తీసుకోగోరినా అతను ఒకటికి పదిసార్లు ఆలోచించడం, చివరికి ఏ నిర్ణయానికి రాలేక దానిని వదిలివేయడం ప్రారంభించాడు. ఒకవేళ ఏదైనా ఒక నిర్ణయం తీసుకున్నా, దాని పరిణామాలెలా వుంటాయోనని మధనపడిపోవడం ప్రారంభించాడు. దీనివలన అతని వ్యాపార అవకాశాలుకూడా ఎంతగానో దెబ్బతిన్నాయి.

సుభద్రతో తనకేర్పడిన పరిచయమే తనలో ఇంతటి మార్పు రావడానికి మూలకారణమని అతడు త్వరలోనే గుర్తించకలిగాడు. అతను తీసుకొనే నిర్ణయాలన్నిటిని ఆమె విమర్శించుతూ వుండేది. అతను ఫలానా సినిమాకు వెళ్దామని సూచించితే దానికి టిక్కెట్లు అందవనేది. ఆ సినిమా చూశాక తలనొప్పి వస్తుందని, ఒకటి రెండురోజులపాటు ఏమీ చేయబుద్ధికాదని హెచ్చరించేది. అతను ప్రతిరోజూ ఎన్నెన్నో పొరపాట్లు చేస్తుంటాడని, దీనివలన ఎంతో నష్టపోవలసివస్తుందని ఊహాగానాలు చేసేది. అతని అభిప్రాయాలు మార్చుకోమనేది. తనతో ఏకీభవించేలా ఆలోచించమని నిర్దేశించేది.

సుభద్రతో దాంపత్యం నెరపడం తనకు సాధ్యంకాదని ప్రదీప్ చివరకు ఒక నిర్ణయానికి వచ్చాడు. ఆమె కోరిన విధంగా ప్రవర్తిస్తే తన సామర్థ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పూర్తిగా కోల్పోవలసి వస్తుందని, ఆమెకు అనుగుణంగా ప్రవర్తించగోరితే తాను ప్రశాంతంగా వుండలేనని అతను గ్రహించకలిగాడు. ఈమెతో ఎడబాటు సంభవించడం అతని కెంతో క్లేశాన్ని కలిగించింది. కాని చేయకలిగిందేమీలేదు. వారికి పరిచయం ఏర్పడిన ఒకటిరెండు

నెలలలోనే వారు వివాహమాడివుంటే, వారి దాంపత్యం చాలా నిస్సారంగా రూపొందివుండేది. ఎదుటివారి భావాలను, ఆదర్శాలను, వారి జీవన దృక్పథాన్ని గౌరవించకలగాలి. భర్త సామర్థ్యంపట్ల విశ్వాసం కన్పరచాలి. అలాగే భార్య అభిరుచులను, ఇష్టాయిష్టాలను భర్త గౌరవించాలి. అలా ఒకరిపట్ల మరొకరికి గౌరవం. సద్భావం నెలకొనకపోతే వారి మధ్య అనుబంధం క్షీణిస్తుంది. అంతేకాదు. వారి వారి వ్యక్తిత్వాలు కుంచించుకుపోవడానికి ఇది దారి తీస్తుంది.

ఎదుటివారి స్వభావాన్ని సరిగ్గా గుర్తించాలి

చాల మంది ప్రేమికులు ఎదుటివారి స్వభావాన్ని, అలవాట్లను పెద్దగా పట్టించుకోరు. తాము గాఢంగా ప్రేమించుకొంటున్నాం గనుక ఇటువంటి స్వల్పవిషయాలను ఖాతరుచేయవలసిన అవసరం లేదనుకొంటారు. వివాహానికి ముందే తాము విభేదించే అంశాలను గురించి చర్చించడానికి వారు అయిష్టత కన్పరుచుతారు. తమకు బాధ కలిగించే విషయాలను వివాహమైన తరువాత తీరికగా చర్చించుకోవచ్చనుకుంటారు.

కొంతమంది ప్రేమికులు ఎదుటివారి అభిప్రాయాలను గౌరవించలేరు. కాని వారెలా ప్రవర్తించినా, తమకది అయిష్టమైనా, నిశ్శబ్దంగా భరించాలనుకొంటారు. వారికోసం తామే త్యాగం చేయాలనుకొంటారు. ఇది సవ్యమైన విధానం కాదని, దీనివలన దాంపత్యంలో ఎప్పుడైనా సంక్షోభం చెలరేగే అవకాశం శాశ్వతంగా వుంటుందని గుర్తించాలి.

సంతృప్తికరమైన ప్రేమానుబంధం ప్రేమికులందరికీ ఎంతో పారవశ్యాన్ని, తన్మయత్వాన్ని కలిగించుతుంది. ఎదుటివారిని గురించిన తలపులే పులకరింపజేస్తాయి.కాని, ప్రేమలో చిక్కుకున్నవారు తరచుగా పరధ్యానంగా, ఏదో కోల్పోయినట్లు భావించుకొంటుంటే వారి ప్రేమానుబంధంలో ఏదో లోపం వుండివుంటుందని గుర్తించాలి.

వసుంధర కాలేజీలో చదువుతోంది. ఆమె సౌమ్యురాలని అందరూ అభినందించేవారు. ఆమె ఒక యువకుణ్ణి ప్రేమించింది. అతనితో సాయంత్రం వేళ ఓ రెండు గంటలు గడిపివస్తే ఆ రాత్రంతా ఆమెకు సరిగ్గా నిద్రపట్టేదికాదు. మరుసటిరోజు తన చెల్లెళ్ళపై విసుక్కొనేది. తల్లితండ్రులతో పోట్లాడేది. ఆరోజు స్నేహితురాళ్ళతో విభేదించి వారిని అనవసరంగా విమర్శించేది. తాను ప్రేమించే యువకునితో కలవాలని, అతని సాన్నిధ్యంలో కొంతసమయాన్ని గడపాలని ఆమె ఎంతగానో అభిలషించుతున్నా, అతన్ని కలవడానికి అయిష్టత కన్పరచేది. ఎదుటివ్యక్తిని ప్రేమించి, అతనితో జీవితాన్ని పంచుకోకల్గిన మానసికపరిణతి అలవడకపోవడం వలన ఆమె ఇలా ప్రవర్తించేది. ప్రేమానుభవం మధురంగా కాక భరించలేనిదిగా భావిస్తుంటే – వారి మధ్య ప్రేమ ఎంతోకాలం నిలవదని నిర్ణయించవచ్చు.

తరువాత ఎదుటివారికి సంబంధించిన అంశాలను గురించి చర్చించకుండా గోప్యంగా వుంచటానికి చాలమంది ప్రయత్నిస్తుంటారు. యువకుని ఆస్తిపాస్తులనుగురించి యువతి ప్రశ్నించకపోవచ్చు. అలాగే అతని బంధువులను గురించిన ప్రసక్తి తీసుకురావడం అతనికిష్టం వుండకపోవచ్చు. తన వయస్సును గురించిన ప్రసక్తి తీసుకురావడం ఆమె కిష్టం వుండకపోవచ్చు. అలాగే ఆమెతో చనువుగా వుండే యువకులను గురించి అతను

ప్రశ్నించక పోవచ్చు. ఇవన్నీ కూడా భవిష్యత్తులో వారి దాంపత్యాన్ని ఎంతగానో ప్రభావితంచేస్తాయి.

స్నేహితులను గురించి తలెత్తే విభేధాలు

ఎదుటివారికున్న స్నేహితులపట్ల తమకెటువంటి దృక్పథమున్నదన్నది ఎంతో ప్రధానమైన అంశం. అతని స్నేహితులందరు చాల చవకబారు వ్యక్తులని, వారితో సన్నిహితంగా మెలగడాన్ని తాను ఆమోదించలేనని ప్రియురాలు అంటుంది. అలాగే ఆమె స్నేహితురాళ్ళు ఏమాత్రం నియమాలులేని వారని, వారితో ఆమెకు స్నేహమేమిటని అతడు ఆరోపిస్తాడు. ఇంతకుముందున్న స్నేహితులతో సంబంధాలను తెగత్రెంపులు చేసుకొని ఇద్దరికీ ఆమోదయోగ్యమైన నూతన వ్యక్తులతో క్రొత్తగా స్నేహాన్ని నెలకొల్పుకోవాలని వారు భావించితే వారి ప్రేమ చిక్కులలో పడనున్నదని గ్రహించవచ్చు.

తమ మధ్య స్నేహితులగురించి తలెత్తిన విభేదాలు, జీవితంపట్ల తమకున్న అభిప్రాయబేధంగా గుర్తించాలి. తన ప్రియుడు ఎంతో ఉన్నతుడని, అతని స్నేహితులంతా చెడ్డవారని. ఇతడిని దిగజార్చడానికి ప్రయత్నిస్తుంటారని భావిస్తుంటే –తన ప్రియుని పట్ల ఆమెకు సవ్యమైన అవగాహన లేదని గుర్తించాలి.అలాగే తన ప్రియురాలి స్నేహితురాళ్ళపట్ల ఆసక్తి, ఇష్టత కన్పరచలేని వ్యక్తి ఆమెపట్లకూడా అనతికాలంలోనే అనాసక్తి పెంచుకొంటాడని గుర్తించాలి.అందుకే స్నేహితుల విషయంలో తమమధ్య తలెత్తిన బేధాభిప్రాయాలను తీవ్రంగా పరిగణించాలి. తమ మధ్య ఇంతవరకు తాము గుర్తించని విభేదాలు వున్నట్లు గ్రహించాలి.

గుర్తించాల్సిన వైరుధ్యాలు

యువతీ యువకులు ప్రేమలో చిక్కుకొన్న మరుసటిరోజునే తమకు మధ్య వున్న వైరుధ్యాలను గుర్తించడం వారికి సాధ్యపడకపోవచ్చు. ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి సమయంపట్టే రీతిలోనే ఇలా వైరుధ్యాలను గుర్తించడానికి కూడా కొంతవ్యవధి కావాలి. అందుకే ఒకటి రెండు సంవత్సరాలపాటు వివాహమాడకుండా వుండకలిగిన ప్రేమికులు తమ దాంపత్యాన్ని ఎంతో అన్యోన్యంగా గడపకల్గుతారని చెబుతారు. కొంతమంది తమ మధ్య తల ఎత్తుతున్న వైరుధ్యాలను గుర్తించడానికి నిరాకరించుతూ,వివాహమాడడానికి వేగిరపడుతారు. తాము వివాహం చేసుకోవాలన్న దృఢనిర్ణయంతో వాటిని ప్రక్కకు నెట్టివేస్తారు.

ఒక వ్యక్తి తీవ్రమైన అభద్రతాభావనకు లోనయివుండవచ్చు. జీవితంలో తీవ్రమైన నిరాశా, నిస్పృహలకు గురికావచ్చు. ఏమి చేయబోయినా అసంతృప్తే ఎదురుకావచ్చు. ఇటువంటి వారు వివాహమైనపిదప తమ స్థితి చక్కబడుతుందని భావిస్తారు. వారు ఏదైనా ప్రేమవ్యవహారంలో చిక్కుకొంటే మధ్యలో ఎన్ని చిక్కులు ఎదురైనా వాటిని పట్టించుకోరు. వివాహం చేసుకోవడమే తమ గమ్యమనుకొంటారు. అన్యోన్యదాంపత్యం గడపాలని వారు అనుకోరు.తమ కనుగుణమైన వ్యక్తి తారసిల్లేవరకు వివాహాన్ని వాయిదా వేయడానికి ససేమిరా అంగీకరించరు.ఇటువంటివారు ఎదుటివారిని సవ్యంగా అంచనా వేయలేరు.

మరికొంతమంది అతితేలిగ్గా నిర్ణయాలు తీసుకొంటూ తరువాత పశ్చాత్తాపపడుతుంటారు. ఈ ధోరణి వారికి అలవాటైపోతుంది. తమ ప్రేమవిషయంలో